


నేత్రం నా సంకేతం

డా. సుమనశ్రీ

ఒకటో దృశ్యం

రోడ్డుమీద ఎవరూ లేరు నేనూ నా కళ్ళూ తప్ప. ఎదురెదురుగా కోటలూ కోవెలలూ చేతులూపుకుంటూ చరిత్ర చర్చించుకుంటున్నాయి. ఎక్కడ్నించో కాలుతున్న గోధుమ రొట్టె వాసన గాల్లోంచి పల్కరిస్తోంది.

ఉదయాలు చల్లగా స్వప్నిస్తూ అడుగిడే యాత్రికులకు పాపం నాదేశం శ్మశానాల్ని తప్ప మరేం చూపించలేక పోతోంది. నా రాజధానిలో నల్దిక్కులా శ్మశానాలే యాత్రా స్థలాలు. శవాలచుట్టూ కట్టిన అంతస్తుల భవనాలే నివాసాశ్రమాలు.

నాదేశం రోడ్లమీద నడిచేవి బ్రతికున్న శవాలు. అవి ఫుట్‌పాత్‌ల మీద విశ్రమిస్తాయి. నీడలో నిల్చుని నిట్టూర్పులు విడుస్తాయి. గుండెల్నిండా గాలి పీల్చుకోవడ మెలాగో తెలీక గుబులు ముఖాలు పెడతాయి. ముఖాల నిండా విషాద భాస్వరాల్ని ముద్దలు ముద్దలుగా చిమ్ముతూ వుంటాయి. ఐనా ఆశ మాత్రం చావదు.

ఏమో ఎవడికి తెలుసు - ఏ రోడ్డుమీద ఏ కొంటెచూపు పలకరిస్తుందో ఏ కంటి జీర ఈ గుండె నరాల్ని చటుక్కున కొరుకుతుందో - ఏ కంటి నలుసు మనసులో సుళ్ళు తిరుగుతుందో- అంతా నడిరోడ్ల కన్నీళ్ళ మధ్య అన్వేషించాల్సిందే :

ప్రతి ఇంటిగుహలోకీ ప్రతి వీధిమలుపులోకీ ప్రతి సాయంత్రపు వంతెన కింది సముద్రాల్లోకీ, ప్రతి స్పందించే హృదయ నదుల్లోకీ తొంగిచూస్తున్నాను. కళ్ళబాణాల్ని రువ్వుతూ ప్రతివీక్షణాల్ని నిశ్శబ్దంగా రికార్డుచేస్తున్నాను. బాధామయ దృశ్యాలకి బరువెక్కుతున్నాను.

జ్ఞాపకాల్లో బ్రతుకుతున్న నా ఇంటి అల్మారాల్లోంచి కావ్యాలు దండెత్తుతున్నాయి. పేజీపేజీలో కవిత్వ నారింజ రసాన్ని చప్పరించాలని నా కళ్ళు వెతుకుతున్నాయి.

కుదుపు కుదుపుకీ బస్సులో ఎత్తుపల్లాల్ని మోస్తున్నట్లు కవితల పాదాల కుదుపులకి నా కళ్ళలో భావాలు ఎగిసిపడుతుంటాయి. సున్నితంగా గుండెల్లో పొడుస్తుంటాయి.

ఈ క్షణం తన నగ్నసముద్రంలోకి రమ్మని కవిత్వం ఎగతాళి ఆహ్వానాల్ని అందిస్తోంది. బస్ షెల్టర్ల నిరీక్షణలలో నా బంగారు క్షణాలన్నీ జారిపోతున్నాయి. ఒరిగిపోతున్న నా కళ్ళలోని ఏకాగ్రతని వెక్కిరిస్తూ నా చేతిసంచీ ఊగుతోంది. నగరాన్ని దర్శిస్తున్న నా కళ్ళలో కవిత్వానికి ఏ క్షణాలూ మిగల్టం లేదు.

ఏముంది ఈ పురాతన కట్టడాల్లో ఇంకా చూడ్డానికి? రమ్యమృగ వీక్షణలు చేస్తూ ఎప్పుడో రతీమన్మధులు నడిచిన స్థలాల్లో ఇప్పుడేముంది చూడ్డానికి. వెలిసిపోయిన రంగుల పువ్వుల ఉద్యానవనాలు తప్ప. పాలరాతి విగ్రహాల్లో ఒకనాటి అందాల్ని కృత్రిమంగా ఊహించుకోవటం తప్ప.

సజీవ సుందర శిల్పాలు రోడ్ల మీద రంగుల గుర్రబ్బగ్గీల్లో ప్రయాణం చేస్తున్నాయి. మృత్యుముఖాల్లో అదృశ్య సౌందర్యాల్ని చూడ్డం సాయంత్రాన్ని చూసి ఉషస్సుగా భ్రమపడడమే. నైరాశ్యపు చీకట్లో వెలుగును ఊహించుకుంటూ కలలు కనడమే.

యాత్రికుడంటే ఎవడు? రోడ్లపై మనిషి. కాలాన్ని వృధాగా వెచ్చిస్తూ రంగురంగుల రాళ్ళ గుట్టల్ని స్వంతం చేసుకొన్నవాడు. ఓనాటి చిలుంపట్టిన రాగిపాత్రల్ని ఆప్యాయంగా చంకనేసుకునేవాడు. ఊపిరి పీలుస్తున్న స్వచ్ఛ స్ఫటికాల్ని కాదని పగిలిన గాజు పెంకుల్నీ నత్తగుల్లల్నీ భద్రంగా దాచుకునేవాడు.

కళ్ళు తప్ప హృదయం లేని ముక్కు తప్ప సజీవ జీవాత్మ లేని అమాయక ప్రాణీ! ఏముంది ఆ పురాతన కట్టడాల్లో ఆస్వాదించడానికి-చిమ్మే దుర్గంధం తప్ప.

అదృశ్య సౌందర్యాల్ని అస్పృశ్యంగా అన్వేషించేవాడా! అతిమనోహర భంగిమల్లో సుందరంగా కదుల్తున్న ఆ అవయవాల అంతరంగాల్ని చూడు- రంగురంగుల ముఖాల్లో అంతులేని సౌందర్య స్వర్గాలు!

కనురెప్పల కదలికల్లో ఆవిష్కరింపబడుతున్న అద్భుత సూర్యోదయాలు. విచ్చుకుంటున్న ప్రతి పువ్వూ అనంత సువాసనల్ని ఝళిపించే పచ్చబాకు!

విరిగిపోయిన వెన్నెముకల ఆ కోటల్లో ఏముందింకా చూడ్డానికి? విజయ కేతనం ఎగరేస్తున్న మానవప్రపంచాన్ని చూడు. ఉషస్సును పారబోసుకుంటూ కృత్రిమ కలల్లో ఎక్కడని వెతుక్కుంటావ్ బంగారాన్ని!

ఇలా బాల్కనీలోకి రా- ఉషస్సులో కలిసిపోతున్న ప్రవాహాన్ని చూడ్డానికి. హృదయాన్ని దోసిలి చేసుకొని సాగిపోడానికి.

రెండో దృశ్యం

అర్థం కాని బాధలో అస్పష్టంగా సంభాషించే నేను ఎల్లలులేని ఈ ప్రపంచాన్ని నీ కళ్ళతో తప్ప మరే కళ్ళతో కొలవను? నీకు దూరమై బరువెక్కుతున్న ఈ గుండెపై ఎన్ని కన్నీళ్ళని కురవను? దూరం దూరంగా పోతున్న నిన్ను ఏ అయస్కాంత హస్తాలతో నా వైపు లాక్కోను?

ఎన్ని కన్నీళ్ళయినా ఖర్చవనీ, ఎన్ని గాయాల రక్తం అయినా స్రవించనీ. గడిచిన వసంతం కళ్ళ వెనుక మెదులుతున్నంత సేపూ నీ కంటి చూపు నా పెదవులపై జల్లై కురుస్తున్నంత సేపూ నాకు మరణంలేదు. శిలువ వేసినా మళ్ళీ మళ్ళీ మొలవగల అనంత కాంతిజలన్నేను.

నీరసంగా వేలాడుతున్న చెట్లనడుగు చెబుతాయి ఎండలెలా కాస్తున్నాయో! బడబాగ్నుల్లాంటి రోడ్లలోబడి అడుక్కుంటున్న వాళ్ళ కళ్ళనడుగు చెబుతాయి గాలి ఎలా చెట్ల తొర్రల్లో మూల్గుతోందో. తడారిపోయిన గుండెల్ని విప్పుకుంటున్న మట్టి పెళ్ళల్నడుగు చెబుతాయి ఇసుక రేణువులెలా వేగిపోతున్నాయో. గుండె చీలిపోయిన ధరిత్రినడుగు చెబుతుంది దాని కడుపులోని అగ్నిపర్వతాల కథ.

వెన్నుపూస ఎలా కరుగుతుందో ఏమో ఎడారిలో ఏది ప్రవహిస్తుందో ఏమో -

నన్ను మాత్రం అడక్కు నీ కవిత్వం ఎప్పుడు ఎండి పోతుందని!

నా కొమ్మల్లో ఆకుపచ్చదనం ఎప్పుడు ఆవిరైపోతుందో నాకే తెలీదు.

కిటికీ మీది రక్తపు చుక్కలు వెక్కిరిస్తున్నాయి. బీటలు వారిన గ్లాసు బిగ్గరగా రోదిస్తోంది. అమాంతం మీదికురుకుతానంటూ రొదచేస్తోంది రోదసి.

నాలో ఒక పవిత్ర జలపాతం దూకుతోంది. గాలి చేసే గురుత్వనాదం నా చర్మపు గుహల్లో మజ్జ మాంసాది మైదానాల్లో అరుస్తోంది.

నన్ను గురించి నేనే చేసుకుంటున్నా విఫల పరిశోధన.

నేనెక్కణ్ణించి వచ్చానో తెలీదు. ఎక్కడికి పోతున్నానో తెలీదు.

నా కాళ్ళనిండా గాజు పెంకుల రక్తపు మరకలు. ఊపిరి పీలుస్తున్నా ప్రాణం అందుకోలేక పోతున్నా. తోటిమనిషి గుండెలోకి తొంగిచూడలేక పోతున్నా.

ఎలా బ్రతుకుతున్నానో నాకే తెలీదు. ఎండిపోతున్న ఏరులా వుంది నా బ్రతుకు. ఎడారి ప్రయాణంలా వుంది ప్రతి పగలూ.

రాత్రి సముద్రంలో చంద్రుణ్ణి చంకలో పెట్టుకుని మున్కలేస్తున్నా, తీవ్రంగా అలలు తీరానికే తోసుకొస్తున్నాయి.

రోజంతా ఏం చేస్తున్నానో నాకే తెలీదు. రోడ్లు చుట్టలు చుట్టుకుంటున్నాయి.

అసహనంలోవున్న నేను సమూహంలో ఇంకిపోయాను.

ఎక్కడికి పోవాలీ సాయంత్రంవేళ. ఏగుహలో తలదాచుకోవాలి. నన్నీడ్చుకెళుతున్న రైలు పట్టాలమీద పరిగెట్టటం లేదు. అలసిన నా మందాకినితో చేతులెత్తి పిలుస్తున్న ప్రకృతిలో లీనమైపోవాలని ప్రయత్నిస్తోంది.

నలుగురిలో వున్నా నేను నగరం నాగరికత నుంచి వంటరితనాన్ని ఆత్మకి అలంకరించుకున్న వాణ్ణి.

మహానగరాల మీంచి ఎగురుతూ పువ్వులు పువ్వులుగా నాకనురెప్పలపై కురుస్తోంది మంచు.

కిటికీలోంచి పువ్వులు పళ్ళె వొళ్ళు విరుచుకుంటున్నాయి. ఏనాటి జల ప్రవాహమో ఈ ప్రకృతి- ఒక్కసారి నా గదిలోకొచ్చి నిశ్శబ్ద

సముద్రమై నిల్చిపోయింది.

ఒంటరిగా వున్నా ప్రశాంతంగా వున్నాను. లోపల సుడులు తిరిగి పోతున్నా నా జలాలు ప్రశాంతంగానే వున్నాయి. నా నిద్రలో స్వప్నాలు రాల్చకు.

నా హృదయం ప్రస్తుతం పుష్కరిణిలా వుంది. మొసళ్ళ మధ్య తల పెట్టుకుని పడుకున్నవాణ్ణి. నా నిద్రా చౌర్యాన్ని భగ్నం చేయకు –

అంతరంతరాల్లో కోరికలున్నా గోడలమధ్య బూజులా వ్రేలాడుతున్నాయి.

నాకు నేనే శాంతిని ప్రకటించుకున్నాను. అంగాలన్నింటినీ బంధించుకున్నాను. అగ్నిపర్వతాల్ని చల్లార్చడం నేర్చుకున్నాను. భూకంపాల్ని మింగడం నేర్చుకున్నాను. నేను నా దేశంలో అశాంతిపై పోరాటం సాగిస్తున్నాను.

చిలిపివలపుకోసం చింతచిగురుకోసం మామిడిపళ్ళకోసం వెదికే నా ఇంద్రియాల్ని అద్భుతంగా అదృశ్య సంకెళ్ళతో బంధించుకున్నాను. ఒంటరిగా వున్నా ప్రశాంతంగా వున్నాను.

కోపతాపాలకి నిప్పంటించుకున్నాను. మలయ పవనాల్ని ఈసడించుకున్నాను. జలపాతాల క్రింద శిరస్నానాలు చేసాను. నీళ్ళలో నా ప్రతిబింబాన్ని చూసుకుంటూ ఉదయసంధ్యల్ని నా కంఠంలో అలంకరించుకున్నాను.

నా స్వరం అదృశ్య స్వప్నాల్లో దారి తప్పిపోయింది.

నా కలల్ని సర్పాలుగా మార్చకు.

ఇప్పుడు నేను ఆమె రెండు కళ్ళ మధ్యా లంగరేసుకుని పడున్న పడవలా వున్నాను:

రెండు పక్షి రెక్కల మధ్య చిన్నచిన్న చేతులమధ్య
రెండు విశాల ప్రపంచాల బాహువుల మధ్య
వినీలాకాశాల నేత్రాంచలాల మధ్య
విశ్వ రహస్యాల్ని గుప్పిట పట్టిన రెండు పాలరాతి భరిణల మధ్య
ఆమె రహస్య వక్షస్థలానికీ ఆకాశానికీ మధ్య

నాకు నేనే స్వహస్తాలతో సంకెళ్ళు వేసుకున్నాను.
ఏ నేత్రాతీత గుహల్లో ఏ విగ్రహాల్ని చూసిందో
ఏ నారింజ తొనల్ని వొలిచి వచ్చిందో -
ఒక రహస్య నది నాలో ఉరకలు వేస్తూ ప్రవహిస్తోంది.

ఏకాంతంగా ఆమె రెండు కళ్ళ మధ్యా నన్ను నేనే నిర్బంధించుకొని గాలి మేస్తూ పడుకున్నాను. ఇవాల్టికి నా పడవ ప్రయాణం మానుకున్నాను.

మూడో దృశ్యం

నా కళ్ళు చెబుతాయి! శతాబ్దాల మానవ అశ్రు సముద్ర గర్భాల్లోంచి పెల్లుబికే అస్తవ్యస్త చరిత్ర వెదజల్లిన రక్తవస్త్ర నిర్భాగ్యత –

నా కళ్ళు ప్రతిఫలిస్తాయి! నిర్మమతా నిర్మానుష్య సామ్రాజ్య వ్యవస్థలో పర్వతాల మీద ఊగిసలాడుతూ భూమి పట్టుకోల్పోతున్న మహావృక్షంలా మరణాన్ని కౌగిలించుకుంటున్న మానవ మస్తిష్కపు అశక్తత –

సూటిగా చూడు! సూదుల్ని గుచ్చి చూడు.

ఇప్పుడు మనం ఒకరి కళ్ళల్లో ఒకరం ఏదో వెతుక్కుంటున్నాం.

ఎప్పుడో ఎక్కడో తప్పిపోయిన వ్యక్తుల ఆప్తుల సమగ్ర చరిత్ర రహస్యాల్ని మౌనంగా తవ్వుకుంటున్నాం

మనం ముచ్చటించుకుంటున్నాం నిశ్శబ్దంగా –

నిశ్శబ్దంగా అనుభవిస్తున్నాం మనిద్దరం ఒక తీయని రంపపుకోతని.

కళ్ళతోనూ, ఊపిరితోనూ సంభాషించుకుంటున్నాం.

నిశ్శబ్దమే శక్తి సంజనితం. మౌనంగా మనం మాటలకందని అనుభూతిని జుర్రుకుంటున్నాం. నేత్ర ఖడ్గాలతో ఒకర్నొకరం సున్నితంగా పొడుచుకుంటున్నాం.

ప్రశాంతంగా చూడు! నా కళ్ళనీ పెదాల్నీ చూడు నా శిరోజాల్ని, సిగ్గుతో రాలిపోతున్న రెప్పల రేకుల్ని –

ఏది నోరు విప్పి చెప్పుకోలేమో అదే నిజమైన అనుభవం.

ఈ సత్యం మౌన సముద్రమే మనకి తెలియ జెపుతుంది.

రా కూర్చో నా పక్కన, నా చేతినీ నుదుటినీ స్పృశించు.

నా అనుభవాల్ని మౌనంగా స్వీకరించు -

ఎక్కణ్ణించో పౌడరు డబ్బా గుప్పు గుప్పుమంటోంది.

చెంపపిన్నులూ చెవిపోగులూ సంగీతం పాడుతున్నాయి.

బుగ్గలూ మల్లెమొగ్గలూ అత్తరుచుక్కల్ని ఆరబెట్టు కుంటున్నాయి.

సువాసనలు నా ముందు మాలలల్లుకుంటూ కూర్చున్నాయి. నా వాలు కుర్చీ చొక్కా విప్పుకుని గాలి పోసుకుంటోంది. కలల్ని వొంపుకుంటున్నాయి నా కళ్ళు.

నాట్యమాగి పోయినప్పుడు గుండె ఆగి పోయినట్లుండటం విచిత్రం కాదు. కళ్ళాపి జల్లిన ఇళ్ళూ పళ్ళు తోముకుంటున్న వేపకొమ్మలూ అరమోడ్పు కళ్ళతో రాత్రంతా నిరీక్షించిన రెమ్మలూ నాపై గుప్పిళ్ళతో పుప్పొళ్ళు వెదజల్లుతున్నాయి.

పచ్చగా కిటికీలోంచి చల్లగాలి కబుర్లాడుతోంది. చెట్లలోకీ చేలలోచింపిరి చింపిరి చింతచెట్ల గుబురులోకీ,

కొబ్బరిచెట్ల తెల్లని పలువరుసలోకీ సరస్సులో బారులు తీరిన తెల్ల కొంగల పొడవాటి ముక్కుల్లోకీ,

రమ్మని ఆహ్వానిస్తోంది.

చీపురుతో ఊడ్చేసినా మాగిన మల్లెపూలు మళ్ళీ మళ్ళీ ఆహ్వానిస్తున్నాయి.

కలల్ని రేపే కళ్ళని అన్వేషిస్తూ నా వలపు పొలాల్లోకి పరుగులు తీస్తోంది.

తెల్లవారింది.

రాత్రి మరకలింకా ఆకాశపు పంచె అంచులకి అంటుకునే వున్నాయి. కిటికీ నిండా వెలుగు తుంపర్ల వర్షం కురుస్తోంది. రాత్రి ఆకలి ఇంకా నా కళ్ళ ముందు మెరుస్తోంది.

కళ్ళలో ప్రాణాల్ని లాగేసిన ఆకలి నా గుండెల్లో ఇంకా స్రవిస్తూనే వుంది. శూన్యరక్తంలో నన్ను మళ్ళీ ఏకాకిని చేసింది.

చీకటి ముంగురుల్ని మెరిపిస్తూ నన్ను మత్తులా ఆక్రమించుకుంది

రాత్రి. నా ఒంటరితనాన్ని తన నిత్యయవ్వనంలో నిమజ్జనం చేయించింది.

ఆకలి రుచి ఎరగని కడుపుల్ని చూస్తే నాకు జాలేస్తుంది. దొరికిన అంబలి గటగట తాగే నన్ను చూస్తే అందరికీ అసహ్యమే.

ప్రకృతి నన్ను ప్రతిరోజూ బ్రతికిస్తుంది. చుక్కల్నీ చంద్రుణ్ణీ చూసుకుంటూ అదృశ్య ప్రేయసితో షికార్లు చేస్తుంటాను నా తోటలో. ఉదయాన్నే విరిసే సూర్యోదయాన్ని ఎర్రగులాబిలా ఆఘ్రాణిస్తను.

రాత్రి స్పర్శకోసం మళ్ళీమళ్ళీ ఎదురుచూస్తాను. ఎర్రని మంటల్ని నా కళ్ళముందు వెలిగించుకుంటూ జాగరణలు చేస్తాను.

మంటల్ని స్మరిస్తున్న నా చేతుల్ని ఏ గోడ ముట్టుకున్నా ఎర్రరక్తంతో విప్లవ నినాదాలమయమై పోతుంది. ఏ మనిషి నా నేత్రాల్ని స్పృశించినా అగ్ని వర్షమై కురుస్తుంది.

చల్లారకుండా పిడుగుల్ని నల్దిశలా వెదజల్లుతున్న మంట నా కళ్ళ నిండా గుండె నిండా కురుస్తోంది.

ఒంటరితనం నా భ్రమ –

ఏ చీకటి వాకిలి వార చూసినా నా వాళ్ళ ఆనవాళ్ళు తెలుపుతూ కోట్లాది ఆకలి వాసన వేసే అగ్నినేత్రాలే.

అవును. మనమంతా సామూహిక హింస ననుభవిస్తున్నాం. అర్ధరాత్రి ఆకాశంలాంటి ఈ దేశంలో ఉదయించే సూర్యుళ్ళకోసం నిరీక్షిస్తున్నాం.

మన విప్లవగీతికల్ని మనమే సృష్టించుకుంటాం. నిర్బంధాల్నించి రక్షించుకుంటాం.

నాలుగో దృశ్యం

అవునలాగే వుంటాయ్ పరిస్థితులు. నువ్వూ నేనూ లెక్కుండదు. మనమెక్కి తొక్కిన మంచాలూ చూసి చూసి విసుగెత్తిన దూరదర్శన దుర్భిణీ యంత్రాలూ, రాసి పారేసిన ఆత్మకథా సరిత్సాగరాలూ, వాసన చూసి విసిరేసిన మల్లెపూలూ మదన కామరాజు కథలూ కావాలి వాళ్ళకి.

నువ్వూ నేనూ లెక్కుండదు.

మనం సరిగ్గా గాలి పీలుస్తున్నామా లేదా మనం ఒక పూటైనా భోజనం చేస్తున్నామా– నిత్య యుద్ధాల మధ్య కల్లోలితమౌతున్న మన మనసులు సేద తీరుతున్నాయా లేదా – వాళ్ళకెవళ్ళకీ పట్టదు.

మన చీమూ నెత్తురూ పరీక్ష చేస్తారు తప్ప మన అంతరంగాల్ని స్పృశించే ప్రయత్నం చెయ్యరు.

అవునలాగే వుంటాయ్, పరిస్థితులు వెదజల్లే విచిత్రభాస్వరాలు. నీ స్వార్థం నీది నా స్వార్థం నాదంటుంది ప్రపంచం. బ్రతికినన్నాళ్ళూ నువ్వూ నేనూ లెక్కుండదు. చనిపోయాక మాత్రం పెద్ద పెద్ద గోరీలు కడతారు. నడిబజార్లో కాంస్యవిగ్రహాల్ని నిలబెడతారు. పత్రికల్లో సంవత్సరీకాలు ప్రచురిస్తారు.

మరణానంతర భోగాల్ని ఊహించుకుంటూ ప్రస్తుతం మనం వాళ్ళని క్షమించాల్సిందే. సంధ్యలో బీభత్సాన్ని ఆనందంగా అవలోకించాల్సిందే. బ్రతికినన్నాళ్ళూ మనం ప్రతి జీవపదార్థాన్నీ క్షమించాల్సిందే – గాఢంగా ప్రేమించాల్సిందే.

నిశ్శబ్ద కవిత్వం నీటి మీద కొట్టుకొస్తోంది. నీళ్ళమోత నాలో దప్పిక

బావుల బాహువుల్ని చాస్తోంది.

కొత్త కవిత్వం అస్థిపంజరాలకు రంగులేస్తోంది. శిల్ప సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఎండిపోతున్న నదుల్లో గంతులేస్తోంది.

నేతలు బస్తాలకొద్దీ మోసుకొస్తున్నారు కలల్ని ప్రజలకి పంచదార చిలకల్లా పంచిపెట్టాలని. వేదికల ఉపన్యాస సారాలూ పసుప్పచ్చ ముత్తైదువుల చీరెల సింగారాలూ నా దప్పిక తీర్చలేకపోతున్నాయి. ఇన్ని మంచినీళ్ళు నా గొంతులో పొయ్యలేకపోతున్నాయి.

సముద్రాలు పొంగుతున్నాయి ఎందుకూ పనికిరాకుండా. ఉప్పు నీటి వ్యవస్థ ఉరుకులూ పరుగులూ పెడుతోంది. పెడబొబ్బలు పెడుతుంది కానీ జానెడు ముందుకు కదల్దు. అమాంతం మీదికి దూకుతానంటూ కెరటాల జులపాల్ని మీది మీదికి తోసుకుంటూ తెగ ఆయాసపడిపోతోంది. తొడగొట్టి పడిపోతోంది.

మరిన్ని గాయాలైనా నేను మాత్రం స్వప్నాల మధ్య విహరించడం మానలేకుండా ఉన్నాను. రకరకాల నేత్రాల్ని ఆశ్చర్యంగా చూస్తుంటాను. భయంకరమైన నేత్రాల్నీ బాధామయ నేత్రాల్నీ రక్తవర్ణ నేత్రాల్నీ అత్యంత ఆప్యాయంగా చూస్తాను. నా జ్ఞాపకాల రహస్య పుటల్లో భద్రపరుస్తాను.

ప్రకృతినీ నా చుట్టూ ప్రపంచాన్నీ ఒక రంగుల చిత్రశాలగానే గుర్తిస్తాను. ప్రతి భంగిమనీ సునిశితంగా అనుభవిస్తాను.

జీవితం ఆసాంతం బీభత్సరస ప్రధానం కాదు. ఆనందాల అద్భుత సరస్సూ కాదు. చూసే చూపులోనూ అనంత మానవ మానసిక సంఘర్షణని అర్థం చేసుకోగల సున్నిత హృదయ స్పందనలోనూ ఉంటుంది అసలు రహస్యమంతా.

నన్ను మీరు ప్రశ్నిస్తారు! నాకు కళ్ళంటే ఎందుకంత వెర్రిప్రేమ అని. నేత్రాలంటే ఎందుకలా మెలికలు మెలికలు తిరిగిపోతానని !

ఈ అనంతకోటి నేత్రాల్నీ నా సునిశిత సుశిక్షిత చక్షువులతో చూడండి. ఎన్ని దృశ్యాల్ని రంగుల్లో పుక్కిలిస్తూ ఉంటాయో తెలుస్తుంది. ఎన్ని కలల్ని మీ ముందు సుందర వర్ణాల్లో లిఖిస్తూపోతాయో అవగతమౌతుంది.

పొరలు పొరలుగా చుట్టుకున్న చిన్న చిన్న అలమారాల్లో ఎన్ని విలువైన వజ్రాల్ని భద్రపరుచుకున్నాయో ఏమో.

అకస్మాత్తుగా నేత్రాలు అద్భుతంగా ప్రకాశిస్తాయి నీళ్ళ మధ్య తేలుతున్న నా చిన్నప్పటి రంగు రంగుల గోళీకాయల్లా, అమ్మపొత్తిళ్ళ మధ్య చలికి ఎర్రగా వొణుకుతున్న కళ్ళిప్పని నా పసి శిశువులా.

వేదాంతిలా అనంతాకాశంలోకి ప్రశ్నల బాణాల్ని విసురుతున్న నాకు అనంతరూపాల్లో దర్శనమిస్తాయి నేత్రాలు.

ఈ అశ్రుపుష్పాల మధ్య నా జీవితం వర్ణించలేని ఎత్తులకెగిరి ఊహించలేని లోతుల్ని కనుక్కుంటోంది.

అయిదో దృశ్యం

జీవితమే కవిత్వమైనప్పుడు -

నా ప్రతి అనుభవమూ పదమై పద్యమై అనుభవసారం కలయై భవిష్యదాకాశమై గుండె గులాబి పువ్వై ప్రకృతి చిల్కరించే మంచు బిందువుల మధ్య పుల్కరింపై

నా నిర్మల అంతరంగం ఉప్పొంగి పొరలే సముద్ర కెరటమై కాలం కాచి వడపోసి అందిస్తున్న తేనీటి విందై పల్లవిస్తూ ప్రవహిస్తోంది.

జీవితం అసహ్యించుకోదగ్గది కాదు. ప్రతి అనుభవం నీలో నూతన పత్రాన్ని చిగురిస్తుంది. నీ నుదుటిపై సంతకం పెడుతుంది.

ఆటవిక అనుభవం రాజ్యం చేస్తున్న నా దేశపు వీధుల్లో జీవితం పోరాటమే అవుతోంది. తుపాకి తూటాల మధ్య తుత్తునియలౌతున్న ఊపిరే అవుతోంది.

శవంగా బ్రతకడంకంటే తుపాకి నెదిరించి ప్రతి నియంతృత్వ బకాసురుణ్ణీ ఎదుర్కొని

కడుపుమంటై గాల్లో ప్రవహిస్తున్న దావానలమై ప్రజ్వరిల్లే కాంతై ప్రసరించే సూర్యోదయమైనప్పుడే

మనిషి బ్రతికినట్టు లెఖ్ఖ - మనసు బ్రతికినట్టు లెఖ్ఖ.

నాలో కదిలే ప్రతి నరం స్పందించి చెట్టుపై కూర్చుని కిచకిచలాడే పిచ్చుక భాషని వింటుంది. రాపిడిలోంచి పుట్టే అగ్నినీ ఆర్తిలోంచి పుట్టే అనుభవాన్నీ నిరాశా నిస్పృహల మధ్య ధ్వనించే నిర్వేదాన్నీ నా కళ్ళలో బంధిస్తుంది.

జీవితమే కవిత్వమైనప్పుడు –

చిత్తడి నేలమీదయినా చిచ్చు రగుల్తుంది. జీవితాకాశాన మరుభూములు కూడా పుష్పిస్తాయి. మోకాళ్ళదాకా ఎదిగిన ముళ్ళు పుటుక్కున తెగుతాయి. మథించిన మందిరాలన్నీ మట్టి మనుషుల పాదాక్రాంతాలవుతాయి.

ఎక్కడ రెండు నేత్రాలు ముచ్చటించుకుంటూ వుంటాయో అక్కడ నేనుంటాను. నేత్రం నా సంకేతం. ప్రతి దృశ్యం నా ప్రతిధ్వని.

బరువుగా రెప్పలు వాలుస్తున్న నేత్రాలు నన్ను ఉయ్యాలలూపుతాయి. సాగి లాగి విడిచిన బాణాల్లా గురిచూసి నా గుండెల్ని తాకుతాయి. ఆకాశంలో విరిసిన ఇంద్రధనుస్సులా నల్దిశలా రంగుల్ని పుక్కిలిస్తాయి.

లేతాకుమీది వర్షపు చినుకులా, కొమ్మనించి సున్నితంగా వేలాడే పిందెలా, నడుస్తూ నాట్యమాడే మయూరి విప్పిన వేయికళ్ళ ఉద్యానవనంలా కళ్ళు నన్ను మంత్రించి వేస్తాయి. తమకోట గుమ్మాలకి నా గుండెల్ని వేలాడదీస్తాయి.

కళ్ళంటే నాకు రెండు మహా సముద్రాలు. కంటి వెలుగుల్ని అదృశ్యంగా స్పృశించడం నా దినచర్య. ప్రతి కంటి నునుపుకీ ప్రవిస్తూ నా ప్రణయ కేతనాన్ని ఎగరేయటం నేత్రద్వయాన్ని నేను ప్రేమించే చిహ్నం –

రెప్పల్ని పల్కరిస్తూ కళ్ళని వీక్షించడంలో ఒక ద్రాక్షరసా స్వాదన ఉంది. మత్తెక్కి స్నానం చేస్తున్నట్లూ పాలకోవా తీపి రుచిలో మైమరచిన మక్షికమౌతున్నట్లూ కాటుక దిద్దిన కళ్ళ కొసలు కసిగా కుమ్ముతాయి.

పరవశత్వంలో నేను పట్టుపరికిణీల్నీ ఓణీల్నీ కప్పుకుంటూ వుంటాను.

కవిత్వం ఒక నిలకడ లేని పక్షి.

చెట్ల నీడలో పడుకున్నప్పుడూ తోటలో ఎందుటాకులపై చెమరుస్తూ నడుస్తున్నప్పుడూ సేద తీరుస్తానంటూ మీద చేతులేస్తుంది.

సున్నితంగా దగ్గరకు లాక్కుంటుంది. క్షణంలో నన్నెడారిలో వదిలేసి గంతులేసుకుంటూ పారిపోతుంది.

తీర్చి దిద్దిన ఆమె కాటుక కళ్ళని ఊహించుకుంటూ మురిసిపోతానే కానీ తన కళ్ళనెప్పుడూ సూటిగా చూడనివ్వదు.

చవులూరించే పెదాలకోసం నిరీక్షస్తూంటానే కానీ ఒక్కసారి కూడా సంతృప్తిగా ముద్దిచ్చి ఎరగదు.

చుక్కల మధ్యనుంచీ తెల్ల హంసల తెలిమబ్బుల మధ్యనించీ రెక్కలు రెపరెపలాడిస్తూ ఆహ్వానాలు గుమ్మరిస్తూ వుంటుంది.

ఆకస్మాత్తుగా నా చెవుల్లో నాల్గు వాక్యాలు ముద్దుముద్దుగా ఊది తన దారిన పోతుంది. ఇక ఈ గదిలో పక్షుల్నీ పాటల్నీ తిరగబోసుకుంటూ వడబోసుకుంటూ గడ్డం పెంచుకోవడమే నా పనైపోయింది. ఏ పక్షి రెక్కల టపటపలు వినబడ్డా చెవులు రిక్కించడం మామూలైపోయింది.

వాటినలా అల్లుకుంటూ గిల్లుకుంటూ నీటిలో నిద్రలో పడుతూ లేస్తూ ఆకాశాన్నీ అల్లిబిల్లి ఊహల్నీ ఆహ్వానిస్తూ స్వప్నిస్తూ చెవులు చీరుకుంటూ

నాలో నేనే ఏదో గొణుక్కుంటూ వుండి పోతాను.

అందమైన పక్షిలా అలా హఠాత్తుగా నా భుజాలపై వాలి క్షణాల్లో వెకిలి నవ్వులు నవ్వుతూ వెళ్ళిపోవడం తనకలవాటే కావచ్చు. స్వప్న సంగీతం కోసం నిరీక్షిస్తూ ఎడారి బండరాళ్ళ మధ్య ఇరుక్కుపోయి గిలగిల్లాడ్డం నాకొక్కడికే తెలిసిన సత్యం :

కవిత్వ చరణాలకోసం ఆకలి గుహల అంతరంగాల్ని వెతకడం మొదలెట్టాను. బురద బురదగా మురికి మురికిగా జాలువారింది దరిద్రం.

చుట్టూ రాబందులు కాపలా కాస్తున్న హుసేన్‌సాగర్ బొడ్డులో ఏకైక కొండ శిఖరంమీదికి కొట్టుకొచ్చిందొక అస్థిపంజరం. కవిత్వం అలా ఆత్మహత్య చేసుకోవడంలో నాకెందుకో అశ్లీలత ధ్వనించింది.

కవిని సమాజం వెలివేసిందో కవే సమాజాన్ని బహిష్కరించాడో

నాకైతే తెలీదు - ఏకాంత నిశ్శబ్దమే కవికి అంతఃపురమైంది. శిలాసదృశ్యమే జీవితాదర్శమైంది. ప్రేయసి చిరునవ్వే తాంబూల చర్వణమైంది. చెక్కిన శిల్పం కళలేని శిలగానే మిగిలిపోతోంది.

ఒక సమగ్ర వ్యక్తిత్వాన్ని ప్రపంచం మీదికి విసరలేక పోతోంది.

ఆకలి గుహల ఆర్తనాదాలూ నినాద ఘీంకా రావాలూ కవిత్వాన్ని బ్రతికించలేక పోతున్నాయి. అనుభవం లోంచిప్రాణం పోసుకోని వాక్యం అస్పృశ్యతాబాధితం అనాస్వాదితం అప్రస్తుతం -

వేసవి సాయంత్రపు పచ్చిక పరుపులపై దొర్లే వేరుశనగ డొప్పల్లోనూ గుళ్ళముందు చెక్కకాళ్ళతో సాగే శ్రీవారి పాదరక్షల్లోనూ నా గాలింపు కొనసాగుతూనే వుంది.

రెండే రెండు కవితా వాక్య శకలాలకోసం ఆకాశంమీది చుక్కల్ని మొత్తం చీకట్లో వడబోస్తున్నాను.

ఆరో దృశ్యం

కొద్దికొద్దిగా సూర్యరశ్మిని ఏరుకుంటూ అనుభవాల్ని తప్పుకుంటున్నాను. నాలో కన్నీరింకిపోయింది. కవిత్వం కరిగిపోయింది.

ఏ కవిని కలుద్దామని వెళ్ళినా వాడి జేబులో మనిషిననుకుంటాడు.

ఏ పుస్తకం చదువుదామనికొన్నా కాపీ కవితల ఖజానాలే.

విప్లవోద్యమం నగరాల్ని విడిచి అడవులకి పారిపోయిందగ్గర్నించీ నాలో నిస్పృహాజనిత నిర్లిప్తత తాండవిస్తోంది.

నోరిప్పి నిరసిస్తే గాల్లో కలిసిపోతున్న ఆర్తనాదమౌతోంది. ఇమేజరీల మధ్య ఇరికిస్తే గాజు గోడల మీద నిస్సహాయంగా జారిపోతున్న అక్షర బిందువౌతోంది. ప్రపంచం మొత్తం కవిత్వాన్ని బహిష్కరిస్తున్నట్లు కలలొస్తున్నాయి.

నిజంకోసం నా అన్వేషణ దేశాల్ని దాటిపోతోంది. నా పిల్లాపాపల్ని ఏనాడో గాల్లోకి వదిలేసాను. ఏ యువకవి గుండెల్లోకి దూసుకెళ్ళాయో ఏమో ఏవార్తా తెలీటం లేదు.

లేలేత సంకేతాల్ని కోసుకుందామని తోటలన్నీ తిరుగుతున్నా...

ఎండుటాకుల ప్రవాహమే ఎదురొస్తోంది, నేనేరుకున్న నేత్రాలనే మీ కోసం వజ్రాలుగా పొదుగుతున్నా.

మీరాదరించినా ఆదరించకున్నా నా కవిత్వం ఒక దిగులెరగని ప్రవాహం, నాలోంచి మీవైపు ఉధృతంగా పెల్లుబికే ఒక మహాద్భుత జలపాతం.

హెచ్చరికలు లేకుండా నాపై వచ్చివాలే ఒక అప్సరస అనురాగ గీతం! అమృత క్షణాల్లో నే గొంతెత్తి పాడిన అత్యాధునిక సంగీతమే నా ఈ కావ్యం!

కవిత్వం నన్నావహించినప్పుడు నేనొక అహంభావిగా మారిపోతాను. గొంతులోంచి దూకే బంగారు మణుల్ని చూసి మీకంటే ముందుగా నాకు నేనే ఆశ్చర్యపోతాను.

గాలికి ఊగే పువ్వుల్లోంచి నాకొచ్చే ఆహ్వానాలే నా కవితలు. పువ్వు పువ్వునీ పలకరించే మాటలే నా అక్షరాలు.

సింహాసనాలు నా ప్రపంచాన్ని కనుక్కోలేవు. నా ముందసలు నిల్చోలేవు. నా రక్తంలో ప్రవహించే ఎర్రపూల పడవలే నా ఆలోచనలు!

కవిత్వం నా అజీర్ణానికి ఆయువు పట్టవుతోంది.

నా దేహంలోని ఒక్కొక్క అంగాన్నీ కొరుక్కు తింటోంది.

ఎవరితోనో ఒకర్తో హాయిగా ముచ్చటిస్తే తప్ప నా ఈ ఆకలితీరదు. కదుల్తున్న బస్సుల్లోనే నా హృదయం కవితల్ని ప్రసవిస్తోంది. శబ్ద చిత్రాలు అదృశ్య దృశ్య చిత్రాలు నా ముందొక అద్భుత ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తాయి. విచిత్ర స్వప్నాలు నా కవితా వాక్య ప్రవాహాల్లో అప్సరసల్ని ఆవిష్కరిస్తాయి. అక్షర కన్యల్ని నా కౌగిట్లో కట్టిపడేస్తాయి.

నిత్యనూతనత్వంలో జలకాలాడుతూ కొత్త ఊపిరికోసం గాల్లో గాలిస్తూ వుంటాన్నేను. అపురూపంగా నేనేరుకున్న వాక్యాల్ని మీ గుండెల్లోకి విసిరేస్తాను – నల్దిశలా జీవనదులై ప్రవహిస్తాయని!

ఏడో దృశ్యం

ఎవరో నా కోసం పచ్చిక బయళ్ళలో ఎదురుచూస్తున్నారన్న భ్రమ.

ఎక్కడ ప్రకృతి సౌఖ్యం అంతమౌతుందో అక్కడ జీవితం పుష్పించడం మానేస్తుంది.

స్వార్థం నన్నావరించినప్పుడు నాకు చలిజ్వరమొస్తుంది.

అహంకారం నన్నాక్రమించుకున్నప్పుడు ఆత్మహత్య ఉత్తమమన్పిస్తుంది.

ఆత్మచేసే హుంకారనాదం ప్రతి క్షణం నా ఎముకల్లో గంటలు మ్రోగిస్తుంది.

కవిత్వం ఎప్పుడు నన్ను కౌగలించుకుందోగానీ వాక్యం నాలో వక్రంగా ధ్వనిస్తోంది. సంకేతాలమధ్య ఒంటరితనాన్ని అనౌచిత్యంగా అలంకరించుకుంటోంది.

మరో మానవుని స్పర్శకోసం అనుక్షణం తపిస్తుంది నా మనస్సు–

విశాల నితంబాలతో పర్వతాలు నన్ను పుల్కరింపచేస్తూ పల్కరిస్తూంటాయి.

ప్రకృతిరేపే అగ్నిజ్వాలల్ని భరించలేక ఆవేదనతో నా కలల్ని ఏనాడో ఆకాశంలో పట్టపగలే హత్యచేసుకున్నాను.

వాక్యచమత్కారమే నా కళ, వక్రోక్తే ఈ నాటి నా అలంకారం. కలల అలలతో నేనల్లిన వలల్ని నల్దిశలా వెదజల్లుతున్నాను. పదచిత్రాల చేపల్ని వొడుపుగా పట్టడం నేర్చుకున్నాను.

నేనీనాటి అత్యాధునిక కవిని. అందరూ బంగారం ఏరుకుంటూంటే,

నేను మాత్రం పగిలిన గాజు పెంకుల్లో ప్రతిఫలిస్తున్న నూత్న సంకేతాల్ని అన్వేషిస్తున్నాను.

భాషలోని సౌందర్యమణుల్ని జీర్ణించుకుంటున్నాను.

సహానుభూతిని అదుక్కోవడం నా కర్తవ్యం. కవితల్ని విరజిమ్మడం నా వ్యసనం.

క్షమించండి! మీ బాధల్ని గానం చేయలేక పోతున్నాను. అహంకారం నాలో విషపు విత్తుల్ని నాటింది. విలాసాల కోటలో ఈనాడు మానవత్వం శిలయై నిల్చింది.

అయినా మీకూ నాకూ వైరుధ్యమేమిటి? వేషం తప్పు. ముఖం తప్పు. మీరు భగవద్గీతలో ప్రార్థిస్తే నేను ఖురాన్‌లోనో బైబిల్‌లోనో ప్రార్థిస్తా. మీరూ నేను పీల్చేది ఈ పచ్చపూలు విడిచే సుగంధ ద్రవ్యమే అయినప్పుడు - మీకూ నాకూ విరోధమేమిటి?

ఒంటరితనం మనకు మనం విధించుకున్న దురదృష్టం - ఆత్మ విమర్శ ఆచ్ఛాదనల్ని తొలగించి అందమైన లోకాన్ని మన ముందు ప్రత్యక్షం చేస్తుంది.

ఈ దేశం మట్టిలో కవులు చల్లిన సౌందర్యరాసుల్ని ఆత్రంగా ఏరుకుందాం రండి! అంతులేని సహచర్య సాఫల్యాన్ని మనం సమిష్టిగా అనుభవించే సమయం కోసం మనం త్యాగాలు చేద్దాం పదండి!

రోజూపూచే పుష్పాలతో అగరొత్తుల వొత్తైన శిరోజాల్ని నా చేతుల్తో అలంకరిస్తున్నాను.

ఈ శీతల సముద్రంలోకి ఎగిరొచ్చిందగ్గర్నించీ మరణాన్ని మించిన నిశ్శబ్దం నన్ను హత్య చేయాలని వెంటాడుతోంది. చలిగాలి నా చెవిలో మంచు ముద్దల్ని తవ్విపోస్తోంది. నా పంచప్రాణాలూ మంచుముక్కల్లా రోడ్లపై దొర్లుతున్నాయి.

నిశ్శబ్దం నన్ను నింగికెగరేస్తోంది. ఆకులు మరణిస్తూ మరణిస్తూ నన్ను శపించి పోయాయి. సముద్రాలన్నీ గడ్డకట్టినట్లు నా గుడ్డికన్ను చివరి శ్వాస పీలుస్తున్నట్లు కత్తి మొనకింద కోడిపెట్ట గొంతు నిలిపి

నిల్చున్నట్లు నా కళ్ళకింద మంచుముక్క కదుల్తోంది. నీటిలో చిక్కుపడ్డ రొట్టెముక్క నలుగుతోంది. పెదాలకు ఎర్రరంగు పూసుకున్న ఎర్రతోలు మచ్చల పులులే నల్దిక్కులా – కోడిపెట్టలా పొడుస్తున్నారు నా హృదయాన్ని.

నీళ్ళలో గడ్డగట్టిన మంచులో నలుపు తెలుపులు కల్సిపోతూ కరిగిపోతూ కనపడ్డా, అదృశ్యంగా అరగని ఈర్ష్యాసూయలు ఆకాశాన్నించి వేలాడుతూనే వున్నాయి. నిశ్శబ్దాన్ని కౌగలించుకోమని వేధిస్తున్నాయి.

ఇప్పుడు ఇక్కడ నేనొక యుద్ధంలో చిక్కుపడ్డ ఓ వెర్రి సిపాయిని ఎండిపోయిన చెట్టుకింద నీడకోసం వెతుక్కుంటున్న అమాయకుణ్ణి.

ప్రస్తుతం వీధి వీధిన మరణాన్ని మించిన నిశ్శబ్దం నన్ను హత్యచేయాలని వేటాడుతోంది.

ఈ నగరం నాగరికత ప్రక్కింటివాని ఊపిరి నాకు తగలకుండా నన్ను పరిపాలిస్తోంది. తెల్లగా పాలిపోయిన నా ముఖంలో దైహిక వాంఛ మాత్రం అనంతంగా ప్రజ్వలిస్తోంది.

ఎనిమిదో దృశ్యం

అమాయకత్వం నన్ను ఆకర్షిస్తుంది. నాలో గులాబీల్ని పూస్తుంది. నాకు తలక్రిందులుగా సముద్రంలో ఈతకొట్టే తిమింగలాలంటే ఇష్టం. తమకంలో పడవ అడుగున ప్రేమించుకునే చేపలంటే ఇష్టం.

హక్కులో హత్యా రాజకీయాలో నాకు తెలీదు. పోరాటాలో పోట్లగిత్తలో నాకు తెలీదు. సిక్కులో సీజర్లో నాకు తెలీదు. మానవత్వం కరువైన రాజకీయ రాక్షసులంటే నా కసహ్యం.

హిట్లర్లనీ హిడింబాసురుల్నీ శనిగ్రహం మీదికి విసిరేస్తాను. వాళ్ళ గళాల్ని ఖండించి చీకటి చలి కూజాల్లో కూర్చోబెడతాను.

విర్రవీగే విజ్ఞానం మహనీయ మానవుని ముందు గాండ్రించే గార్ధభ సింహం! బాంబుల పాతర మహామనీషి చేతుల్లో భూమి అట్టడుగు పొరల్లో జ్వలిస్తున్న బొగ్గుగనుల్ని రేపుతోంది.

మేధస్సును మేధస్సే ఖండిస్తుంది. మనిషిని మనిషే జయిస్తాడు.

విచ్చు కత్తులు చీకటి క్షణాల్లో విహారం చేసినా ఉదయ కిరణాల ముందు వీగిపోతాయి. వీస్తున్న తుఫానులో వాటి తెరచాపలు చినిగిపోతాయి.

పిల్లల ముఖాలపై దోబూచులాడే నిర్మలత్వం నన్ను నిలదీస్తుంది. రెండు జడలతో కళ్ళ ముందు తోరణాలు కట్టే సుందరి మందహాసమే నా నరాల్లో ప్రాణాన్ని నింపుతుంది.

రంగు రంగుల చేపపిల్ల నా కళ్ళని పొడుస్తోంది. చీకటి కనుకొలకుల్ని చివుక్కున చీలుస్తోంది. చీకట్లో అనుభవం చిలవలు

పలవలుగా కంట్లో సూర్యోదయాల్ని రేపుతోంది.

రెండు దేహాలు రేజీకటిలో రసికత నాస్వాదిస్తూ రమిస్తాయి. చుట్టలు చుట్టలుగా చుట్టుకున్న సర్పమిథునం రోజులతరబడి మరణిస్తుంది. అనంత రూపాల్లో ఆనందం నాట్యమాడుతుంది.

చీకటి సామ్రాజ్యంలో చిక్కటి ఆనందం పొంచివుంది. చీకటి ద్రవ్యాన్ని జుర్రుకోవడంలో మనిషి సామ్రాజ్యాల్ని నిర్మించి కూలదోస్తూ వుంటాడు. గడచిపోయిన కాలం చిత్రంగా కళ్ళముందు రక్త శిల్పాల్ని చెక్కుతుంది. విచిత్ర స్వప్నాల్ని విరజిమ్ముతుంది.

నిన్నటి నక్షత్రాలు ఆకాశంలో ఈరోజు మెరుస్తాయి. మంచు గుహలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య తీగలు తీగలుగా సాగిన అనురాగం ఊడల మర్రిలా బలంగా భూమిలోకి దిగుతుంది.

రాళ్ళలోంచీ మట్టిలోంచీ భూమి నలుమూలలకీ వేనవేల వేళ్ళుగా పాకుతూ ఒక గంగా ప్రవాహమై పట్టణ వీధుల్లో ప్రేమని పంచుతూ పారుతూ వుంటుంది.

జనం దోసిళ్లతో జుర్రుకుంటూ కళ్ళ కాటుకగానూ నుదుట కుంకుమ తిలకంగానూ అనురాగాన్ని అలంకరించుకుంటారు.

చీకటి మేఘాన్ని ఆహ్వానిస్తూ భూమి చిత్తడి చిత్తడిగా చెమరుస్తుంది. నా కళ్ళని కుడుతోంది రంగు రంగుల చేపపిల్ల. వర్షపు బిందువుల్ని నా నాలికపై చిల్కరిస్తోంది.

నేలపై కురుస్తున్న బిందువు బిందువునీ ప్రేమగా పల్కరిస్తూ కళ్ళ మెఱుపుల్తోనే చీకటి ఆనందాన్ని జుర్రుకుంటున్నాను.

తొమ్మిదో దృశ్యం

ఒక వెల్లువలా వస్తున్న ఊహల్ని ఎందుకలా బిరడాతో నొక్కేస్తున్నావ్? అనుభవాల్ని అక్షరబద్ధం చేయడం ఒక సాహసం. ఊహల ఎత్తుల్ని అందుకోగల్గడం నిజంగా ఒక సంగరం-

కఠిన నిర్ణయాల్ని తీసుకోవాల్సిన సమయాల్లో తప్ప మనస్సు మల్లె పూవులా ఊహల సువాసనల్ని వెదజల్లుతుంది. కత్తివాదరమీద నడుస్తున్నప్పుడు తప్ప మనస్సు చిన్నపిల్లలా ఊహల మేడల్ని కదుతుంది. అతి చిన్న గాయానిక్కూడా గుప్పెడు రక్తాన్ని విరజిమ్ముతుంది.

ఊహల్ని బిగబట్టి ఊరిస్తే రక్తం పోటెక్కుతుంది. బంధించి హింసిస్తే ప్రాణం తనువే చాలిస్తుంది. కష్టనష్టాల్లోకూడా ఊహల పల్లకీని విడిచే సాహసం చెయ్యలేను. కారుచీకట్లో కూడా నక్షత్రాల్ని మాత్రం వదులుకోలేను.

నా తొందరలో నేనున్నానే కానీ మూసుకపోతున్న ఆకాశనేత్రాన్ని కానీ ముంచుకొస్తున్న రాక్షస మబ్బుల్ని కానీ గమనించుకోలేదు. నా సమాధిని రక్షిస్తుందేమోనన్న ఆశతో బొచ్చుకుక్కలా వెంటబడి వస్తున్న అక్షరనేత్రాన్ని మాత్రం వెంటతీసుకుని బయల్దేరాను.

విశాల విశ్వంలో అనంత ఆశాలతల్ని పెంచుకుంటున్న నేను ఆకాశంలో మెరుపుల్ని వెతుక్కుంటూ అకస్మాత్ వర్షంలో తడుస్తూ కంటి నెత్తుటి జీరల్ని చల్లార్చుకుంటున్నాను.

అయోగ్యులపై అకస్మాత్తుగా కురుస్తున్న వర్షమా!

కట్టలు తెంచుక పారే వరదల వర్షమా!

నన్ను తరుముతున్న క్రూరాతిక్రూర జంతువ్వి నువ్వు! నా నిశ్చల కవితాసమాధిపై నిల్చిన రెండు పూల గుర్తుల్నీ ఎగరేసుక పోవాలని అదేపనిగా గిరికీలు కొడుతున్న తీతువు పిట్టవు నువ్వు :

సమాధి భంగం చేస్తున్న నీ స్వేచ్ఛా విహారాన్ని ఈ క్షణంలో మాత్రం క్షమించలేను.

ఎప్పుడూ తెల్ల మల్లెపువ్వుని ముద్దిడాలని ఆరాటం

మధ్యరాత్రి నిద్రలేచి నీళ్ళు తాగుతూ ఐస్‌ముక్కల్ని కొరుక్కు తింటున్నప్పుడు మల్లెపూవు నా కళ్ళముందు మెదుల్తుంది.

నిద్రలో మంచం మీంచి కిందపడ్డ చప్పుడు.

తెల్లారిపోయినా నాకింకా నిద్రపట్టలేదు. అన్ని జాములూ అమావాస్యలోనే గడిచి పోయాయి. నా తెల్లమల్లెపువ్వు ఈరోజు బస్సు దిగి వస్తుందేమోనని దూరం నించి ఒక సువాసన చెబుతోంది. నా నిరీక్షణని గ్రహించి ఎంతలా బెంగపెట్టుకున్నావంటూ ఓదారుస్తుందని నీలాకాశమంతటి ఆశ.

అదిగో తెల్లచీరలో అద్భుతంగా మెరుస్తూ వస్తోంది. ఇంకిపోయిన నా కన్నీరు గబుక్కున చిమ్మినట్లైంది. ఎర్రటి పెదిమలు చిట్లినయ్-ప్రణయాన్ని పల్లకీ ఎక్కించటంలో.

కళ్ళలోకి నడిచొచ్చిన మల్లెపువ్వు నా ఎదుటే చీర మార్చుకుంటూ కళ్ళలో శిలాప్రతిమై నా గుండెల మీదికి జారింది మెల్లగా. పువ్వు నా కళ్ళలో లీనమౌతుంటే ప్రపంచం విస్తృతమై ఉదయం నాలో ఊపిరిపోసుకుంది.

పదో దృశ్యం

గుండ్రంగా ఒక సున్నా చుట్టి పై భాగాన ఇరువైపులా రెండుచుక్కలు పెట్టు. రోడ్డుమీది అనుభవాల్నీ ఆలోచనల్నీ అలంకరిస్తున్న నా కళ్ళయిపోతాయి. మధ్యగా ఓ నిలువు గీత పెట్టు. అన్ని మానవ సమస్యల వాసనల్నీ పసిగట్టే పనిముట్టు నా ముక్కయి పోతుంది.

సున్నా కటూ ఇటూ రెండు చేగోడీలు చుట్టు. గుండె గుండెనీ వినగల నా సునిశిత సుశిక్షిత చెవులయిపోతాయి.

ఒక్కమాట చెప్తా విను!

చిత్రాలు గీయటంలోనే మనిషి సహజత్వం వుంది. జీవితాన్ని ఆనందించ గల్గడం ఒక బంగారం చేసే విద్య -

నాకొక్కడికే ఈ ప్రపంచం తెలిసిపోయిందని నేనెప్పుడూ అనుకోలేదు కాబట్టే సముద్రపు ఇసకలో గుల్లల్నీ ఆలుచిప్పల్నీ ఆనందంగా ఏరుకుని నా ఆల్మారాల్లో భద్రంగా దాచుకుంటున్నాను.

ప్రపంచం నన్నింకా మభ్య పెడుతూనేవుంది. కళ్ళు నా కళ్ళల్లోకి సబ్బుబుడగల్ని విసురుతూనే వున్నాయ్. ద్రాక్షపళ్ళనీ చేపపిల్లల్నీ నా చూపుల్లో ఎగరేస్తూనే వున్నాయ్.

నామనస్సింకా ఆర్ద్రతను కోల్పోలేదు. అందంగా చెక్కబడ్డ శిల్పాన్ని చూస్తే నా కళ్ళిట్టే చెమరుస్తాయి.

రెండు పెదవుల సువాసన తగిలి మల్లెమొగ్గల మత్తులో ఊగిసలాడుతుంది నా మనస్సు.

వాస్తవం కలగావడం, కల్లోలం బీభత్సం నూతన సంకేతాలుగా రూపుదిద్దుకోవడం, నిజం భూస్థాపితం కావడం

పట్టపగలే నిర్దోషులు వీధి దీపాల్నించి వేళ్ళాడటం-

నేనేనాడో నా పీడకలల్లో దర్శించాను.

సంకేతాలు సంకీర్ణమౌతున్నాయి. ఆలోచన అగాధమౌతోంది. నరనరం నరకయాతనకు గురౌతుంది.

నాకు మాత్రం పరిష్కారంగా ఎర్రరక్తం ప్రతి గుమ్మంముందూ తీర్చి దిద్దిన తిలకంలా దర్శనమిస్తోంది.

పచ్చని తోరణాలకు బదులు గళంనిండా గాజుపెంకుల మాలలు దాడి చేస్తున్నాయి. ఫిడేలు వాయిస్తున్న పాటగాడు ఫినాయిల్ తాగి నిష్క్రమిస్తున్నాడు. అడవిలో విప్లవ వీరాగ్రేసరుడు అగ్ని బాణాలు కురిపిస్తూ నేల కూలుతున్నాడు.

రాక్షసత్వ రథ సారథులు ఆకాశాల్ని ఆక్రమించు కుంటున్నారు. పూల మొక్కల మధ్య ఆయుధాల్ని పారబోస్తున్నారు.

బ్రతుకు విషాదమై దృశ్యాలు వివర్ణమౌతున్నాయి.

ఆలోచన తెగి గుండెలు మండుతున్నంతకాలం కట్టుకథలేవీ సాగవు. నిజాయితీ నా కళ్ళలో ఎగురుతున్నంత కాలం ఏ అధర్మమూ బ్రతకదు.

రాళ్ళు పూలై పూలు సింహాలై రాజ్యాల్ని కూల్చిన క్షణం వినూత్న సమాజం విప్లవ గానం చేస్తుంది.

వెన్నెల వార్తల్ని ప్రసారం చేస్తోంది. పోరాటాలు ఆకాశాన్ని పొగలాగ ఆక్రమిస్తాయని! మనిషి కండరాల్లో ఆత్మాభిమానం చంపినా చావని గంగా ప్రవాహం.

నేలను విసిరితే బంతికూడా గగనానికి ఎగురుతుంది. స్వతహాగా మనిషి గులాబి మొగ్గ. విరుచుక పడితే విచ్చుకత్తి.

మంటల మీద మనిషిని నడిపిస్తూ శాంతి వచనాలు వల్లిస్తే పంజరాలు బద్దలౌతాయి. ఆటవిక న్యాయస్థానం అగ్నిపర్వతాల మధ్య భస్మమౌతుంది.

కళ్ళలో జ్వలిస్తున్న నా ఆందోళనకి రూపమెలా ఇవ్వాలో తెలీని అన్వేషణలో విలువైన సమయం ఖర్చయిపోతోంది.

నా మనస్సు ఎక్కడెక్కడి విషయాలో చర్చిస్తోంది.

అర్ధరాత్రి కుక్కల అరుపుల్లో ఒక వంద అగ్ని పర్వతాలు పట్టణ వీధుల్ని ముంచెత్తు తున్నాయి. అశాంతిలో నా దేశం అట్టుడికినట్లుడికి పోతోంది.

ఈ చీకట్లో నీళ్ళ కోసం ఎక్కడని వెతకను? నా కలుషితమైన నేత్రాల్ని కడుక్కోడానికి-

విశ్రాంతి దొరికినప్పుడు వీధివేపే చూస్తాను. ఎవరన్నా లోపలికి తోసుకవస్తారేమోనని. ఒంటరితనాన్నించి నన్ను విముక్తి చేస్తారని! గులాబీల తోటలోంచి నెమళ్ళ గుంపయినా అకస్మాత్తుగా నా గుమ్మంలోకి తరలి వస్తుందేమోనని -

కూలిపోతున్న దీప స్తంభాలు, చావు వాసన వేస్తున్న శరీరాలు నాదేశం నగరాల్నిండా గస్తీ తిరుగుతున్నాయి.

వసంతాగమనాన్ని నిరోధిస్తూ విషపూరిత నేత్రాల్ని అగడ్తలనిండా కప్పి పెడుతున్నాయి నిరంకుశ ప్రభుత్వాలు.

నా కాలిబాటలో ముళ్ళ వర్షం కురుస్తోంది. మనసు కోల్పోయిన శిల్పాలు దొర్లుతున్నాయి నా కాలి వేళ్ళని తొక్కుతూ.

మన కనురెప్పల కింద ఒక ఎర్రజీర నిరీక్షిస్తోంది.

వెళ్ళి పల్కరిద్దాం, పదండి!

Ramanasumanasri Foundation

కళ్ళు కలల పడకటిళ్ళు
కొన్ని చూపులు రక్తపు చుక్కలు
చూపులు కొన్ని గాజుపెంకుల్లా గుచ్చుకుంటాయి
ముళ్ళకంపలతో ముట్టుకుంటాయి
నా కళ్ళు అనుక్షణం వెలిగే బల్బులు
కొన్ని చూపులు నిన్ననుక్షణం
వెంటాడి వేటాడే తోడేళ్ళు
చూపుల వోల్టేజీ నువ్వు కొలవలేవు
రోడ్ల సముద్రాలలో కొట్టుకొచ్చే పడవలు కళ్ళు
నా గుండెగది వాకిళ్ళు కళ్ళు
రెప్పల పొత్తిళ్ళ మధ్య
చలిలో వొణికే పసిపిల్లలు కళ్ళు



Dr. Sumanasri

reppala madhya aakasam
nethram naa sanketham